కియోస్క్ సేవలకు చంద్రగ్రహణం

గత వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేయడంతో పాటు అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు అండగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసి గ్రామాల్లోనే రైతులకు విత్తనాలు, ఎరువులు, పంటల సాగుకు సంబంధించి అధికారుల పర్యవేక్షణ వంటి అన్ని రకాల సేవలు అందేవి. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు డిజిటల్ కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అవి అలంకార ప్రాయంగా మారాయి.

- రైతుసేవా కేంద్రాల్లో అలంకార ప్రాయంగా కియోస్క్ యంత్రాలు
- అన్నదాతలకు అందని కియోస్క్ యంత్ర సేవలు
- ఎరువులు, పురుగు మందులు అందక ఇక్కట్లు
- ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతన్నలు





నాగంవాండ్లపల్లె రైతు సేవా కేంద్రం, ఆర్ఎస్‌కేలో నిరుపయోగంగా కియోస్క్ డిజిటల్ యంత్రం

ఐరాల: రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాల వస్తువులు, పశువుల దాణా మార్కెటింగ్ వంటి అన్నిరకాల సేవలు పారదర్శకంగా రైతుల ఇంటి ముంగిటకే అందించేలా ప్రతి సచివాలయ పరిధిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్బీకేల్లో కియోస్క్ (డిజిటల్ టచ్ స్క్రీన్) యంత్రాలు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసి తన మార్కును చూపించాడు. అయితే గత కొన్ని నెలలుగా ఆర్ఎస్‌కేల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో రైతుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డిజిటల్ కియోస్క్‌ల ప్రత్యేకతలు..

ప్రతి రైతు భరోసా కేంద్రంలో డిజిటల్ కియోస్క్ ఏర్పాటు చేశారు. ఇది ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే యంత్రం. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రూ.లక్షలు వ్యయం చేసి వాటిని కొనుగోలు చేసింది. ఇందులో వ్యవసాయ ఉత్పాదకాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న రకరకాల వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెటింగ్ ధరలు అందుబాటులో ఉంచారు. పంట యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియో రూపంలో పొందుపరిచారు. ఈ యంత్రాలతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతులు ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు తదితర అవసరమైన అన్ని సేవలూ ఈ యంత్రం ద్వారా పొందే అవకాశం ఉంది. వాతావరణ సమాచారం, మార్పులు ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. కనీసం ఎరువులు బుక్ చేసుకునేందుకు కూడా వినియోగించకపోవడంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తిస్థాయిలో పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మొక్కుబడిగా ఎరువులు అందిస్తున్నారు. రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభమైనా వీటిని వినియోగించడం లేదు.

కియోస్క్ సేవలు కొనసాగించాలి..



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ కియోస్క్ సేవలు అందించేవారు. గతంలో అందుతున్న సేవలను ఇప్పుడు కొనసాగించాలి.

– గోపి, బీరప్పచెరువు, ఐరాల

పూర్తిస్థాయిలో అందించాలి



రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తిస్థాయిలో రైతులకు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేశాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరహాలోనే రైతులకు అవసరమైన ఎరువులు, అన్ని రకాలు సేవలు అందించాలి.

–నందకుమార్, సీవీ పల్లె, ఐరాల

క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఓ వరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: గ్రామీణ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని చామంతిపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శశికల, యమున, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

టపాసుల విక్రయానికి దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు రూరల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టపాసులు విక్రయించేందుకు ఆసక్తి కలిగిన వ్యక్తులు దుకాణ నిర్వహణకు దరఖాస్తు చేసుకోవచ్చునన్ని తహసీల్దార్ కళావతి తెలిపారు. చిత్తూరు నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పీవీకేఎన్ కళాశాల మైదానంలో టపాసుల విక్రయకేంద్రం నిర్ణయించామన్నారు. ఈమేరకు టపాసులు షాపు నిర్వహించాలనే వ్యక్తులు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. టపాసులు విక్రయించేందుకు ఆసక్తి కలిగిన వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కాగా ఇప్పటివరకు షాపు నిర్వహణకు రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలిపారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం



విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న రెడ్డి జేఏసీ సంఘు సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పేద విద్యార్థినికి చిత్తూరు రెడ్డి జేఏసీ శనివారం రూ.10వేల ఆర్థికసాయం అందించింది. సదుం మండలం పెద్దఉప్పరపల్లి గ్రామానికి చెందిన హబీబ్ చిత్తూరు గంగనపల్లిలో షోడా షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇతని కుమార్తె మంతూష ఎంసెట్‌లో 17100 ర్యాంకు రావడంతో స్విమ్స్‌లో సీటు వరించింది. ఈక్రమంలో ఆ విద్యార్థినికి రెడ్డి జేఏసీ తరపున రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ఈచనేరి శివరెడ్డి, యాగమరెడ్డి, గిరిబాబురెడ్డి, హేమంత్‌రెడ్డి, హరిబాబురెడ్డి ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈఓ రవికుమార్‌నాయుడును శనివారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు రూ.92 లక్షలతో ప్రణాళికను రూపొందించామని వివరించారు. పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, తాగునీటి బోర్లు డ్రిల్, పైపులైన్లు ఏర్పాట్లు, రిపేర్లు చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్

చిత్తూరు అర్బన్: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు ప్రారంభించారు. శనివారం చిత్తూరు నగరంలోని మురకంబట్టు వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త రూ.వంద చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకుంటే, రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందన్నారు. రెండు నెలల పాటు జరిగే సభ్యత్వ నమోదును ప్రతీ కార్యకర్త ఉపయోగించుకోవాలన్నారు. కష్టపడి పని చేసే వాళ్లకు పార్టీలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ అముద, టీడీపీ నేతలు దొరబాబు, హేమలత, కఠారి హేమలత, వసంత్‌కుమార్, చంద్రప్రకాష్, బాలాజీ, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రవికుమార్

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లిలో నిర్మిస్తున్న సీసీరోడ్డును శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రవికుమార్ పరిశీలించారు. రూ.33 లక్షల విలువ గల పనులు చేస్తుండగా రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అనంతరం పాటూరు పంచాయతీలోని మామిడితోట రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలించారు. వేతనదారులకు సకాలంలో వేతనాలు అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది పండ్ల తోట పెంపకం, ఫాంపాండ్ వంటి పనుల పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా పంచాయతీల వారీగా అందరికీ పనులను కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఏపీడీబీ సుబ్రమణ్యం, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములగుడి వీధిలోని జైన్ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: సమాచార హక్కు చట్టం–2005పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఓ వరలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఎం.పైపల్లె రైతు సేవా కేంద్రంలో వివిధ గ్రామాల రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండడంతో పాటు వివిధ సెక్షన్ల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజలు తమకు కావాల్సిన ఏ సమాచారం అయినా అర్జీ ద్వారా సంబంధిత అధికారికి పంపి కోరవచ్చన్నారు. అర్జీ పెట్టుకున్న 30 రోజుల్లో సంబంధిత అధికారుల నుంచి సమాధానం రాకపోతే ఉన్నతాధికారులకు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన సమాచారం ఇవ్వడం సమాచార హక్కు చట్టం ప్రధాన లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ హేమంత్ పాల్గొన్నారు.

ఎం.పైపల్లె విద్యార్థుల ప్రతిభ



రోహిత్



మానస

ఐరాల: మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం అరుణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సి.రోహిత్ ప్రథమ స్థానం, 9వ తరగతి విద్యార్థిని కె.మానస ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు అభినందించారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

గుడిపాల: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం క్రిష్ణజమ్మాపురం గ్రామసభ నిర్వహించారు. గ్రామ మ్యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. భూ సమస్యలకు సంబంధించి రైతులు అర్జీలు అందజేస్తే పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రూపారాణి, వీఆర్‌ఓ నాగరాజనాయుడులు పాల్గొన్నారు.

తాళిబొట్టు వితరణ



తాళిబొట్టు చూపుతున్న నవ దంపతులు

తవణంపల్లె: మండలంలోని పైమాఘం గ్రామానికి చెందిన నవ దంపతులు రూపవంత్, సౌమ్యకు అరగొండ అపోలో గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి నెలకొల్పిన అపోలో సంపూర్ణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రూ.40 వేలు విలువ చేసే తాళిబొట్టును అందజేశారు. శనివారం అరగొండ మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ చేతుల మీదుగా కాబోయే దంపతులకు తాళిబొట్టు అందించారు. కార్యక్రమంలో టోటల్ హెల్త్ సీఓఓ రాంబాబు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి కథనం మేరకు, శనివారం చిత్తూరు–గుడిపాల దారిలోని మాపాక్షి కూడలి వద్ద ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాపాక్షికి చెందిన ఎం.మీనా (35) వద్ద 36 ప్యాకెట్ల కర్ణాటక మద్యం లభించింది. ఈమెకు మద్యం సరఫరా చేసిన నరిగిపల్లెకు చెందిన ఎం.బాలకృష్ణ (32)తో సహా ఇద్దరినీ అరెస్టు చేశారు. గుడిపాల మండలం పిళ్లారికుప్పం వద్ద తనిఖీలు చేస్తుండగా వెప్పాలచేనుకు చెందిన జె.లోకనాథం (53) వద్ద 21 ప్యాకెట్ల కర్ణాటక మద్యం లభించింది. ఇతన్ని కూడా అరెస్టు చేశారు. నిందితులు ముగ్గురినీ న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి, ఆయన ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. దాడుల్లో ఎస్ఐలు మోహనకృష్ణ, పృథ్వీరాజ్, సిబ్బంది శరవణ, రాఘవయ్య, భాస్కరరాజు, ప్రసన్నకుమార్, లోకేష్, సంధ్య పాల్గొన్నారు.

పూత దశ నుంచే జాగ్రత్తలు

పలమనేరు: మామిడిలో పూత దశ నుంచే రైతులు తగిన జాగ్రత్తలను పాటిస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. ఆ మేరకు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు హాలులో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని హార్టికల్చర్ అధికారులు, రైతుసేవా కేంద్రాల సిబ్బందితో మామిడిపూత, పిందెలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీ విజయశంకర్‌రెడ్డి, ఏఓ పద్మజ, హెచ్‌ఓలు లక్ష్మీప్రసూన, వింధ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శనివారం చిత్తూరు నగరంలోని పోలీసు అతిథిగృహంలో జరిగిన ఈ పోటీల్లో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసులకు సవాళ్లు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. పలువురు ఇందులో పాల్గొని ప్రతిభ చూపించారు. విజేతలకు త్వరలోనే నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 31న నిర్వహిస్తామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ కోరారు. శనివారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో మొదటగా 1920 అక్టోబర్ 31న తేదీన ఏఐటీయూసీ ఏర్పాటు చేశారన్నారు. కార్మికుల సమస్యలపైన పోరాటాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నాడు కార్మికులు 16 గంటల పని విధానంపై పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి 8 గంటల పని విధానం, ఆదివారం సెలవుదినం వచ్చిందన్నారు. కార్మికుల చట్టాల కోసం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన ఘనత యూనియన్‌కు దక్కిందన్నారు. ఆ రోజు జిల్లాఅంతటా పండుగలా నిర్వహించాలని వివరించారు. సమావేశంలో నాయకులు మణి, రమాదేవి, విజయకుమార్, సుబ్రహ్మణ్యం, రజినికుమార్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం



వయోవృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ

చిత్తూరు కలెక్టరేట్: దివ్యాంగుల ఆరోగ్య సమస్యలను పరిశీలించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం శుభపరిణామమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ అన్నారు. నగరంలోని తపోవనం వద్ద రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులచే ప్రత్యేక హెల్త్‌క్యాంప్ నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలో ఉన్న 35 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. అదే ప్రాంగణంలో ఉన్న అనాథ శరణాలయంలోని వృద్ధులను జడ్జి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి భానుశేఖర్‌రెడ్డి, పాఠశాల నిర్వాహకులు ముత్యాలశెట్టి, డాక్టర్లు పాల్గొన్నారు.

తెలుగుభాషా పరిరక్షణలో తులసి పుష్పాలు!

- తెలుగుభాష సేవలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి
- సొంత ఖర్చుతో కార్యక్రమాల నిర్వహణ
- నేడు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి పుష్కరోత్సవం



కళా నిలయం, తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి భవనం

పలమనేరు: సంవత్సరంలో వచ్చే అన్ని దినోత్సవాలు, జయంతులు, వర్ధంతులు, వేసవిలో పిల్లలకు శిక్షణ, భాషా పోటీలు, ఉగాది సమ్మేళనాలు, తెలుగు, మాతృభాషా దినోత్సవాలు, ఉగాది పుష్కరాలు ఇలా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో తెలుగుభాషా పరిరక్షణకు దంపతులైన తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. వీరు స్థాపించిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నేడు పుష్కరోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో వారు చేస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.

వారి జీతం, జీవితం తెలుగుభాషాభివృద్ధికి అంకితం..

తెలుగుభాష పరిరక్షణకు పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు తులసీనాథంనాయుడు, పుష్ప దంపతులు. వీరిద్దరు 26 ఏళ్ల నుంచి సంపాదించిన జీతాన్ని సైతం వెచ్చించి తన రూ.30 లక్షల విలువైన స్థలంలో భార్యాభర్తలు రూ.20లక్షలు వెచ్చించి కళామందిరమనే సాంస్కృతిక నిలయాన్ని నిర్మించారు. తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి పేరిట పలమనేరు కేంద్రంగా తెలుగుభాషాభివృద్ధికి కృషిచేస్తున్నారు. తెలుగుభాష కోసం కృషిచేస్తున్న కళాక్షేత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఓ గుర్తింపును పొందింది.

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఏర్పాటు...

తులసీనాథంనాయుడు దంపతులు గురువులుగా బడిలో పిల్లలకు బోధించడంలో మొదలైన తెలుగుపై అభిమానం వీరిని తెలుగుభాషా ఉన్నతికోసం కృషిచేసేలా చేసింది. దీంతో మరికొందరు ఉపాధ్యాయులు, సాహితీప్రియులతో కలసి పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని 2012లో స్థాపించారు. ఇందులో యాభైమంది దాకా సభ్యులున్నారు. వందలాది మంది కవులు, రచయితలు, భాషాభిమానులను సన్మానించి సత్కారాలు చేస్తూ ముందుకెళుతున్నారు.

విద్యార్థులకు లక్షన్నర నీతిపుస్తకాల పంపిణీ...

వీరి సొంత నిధులతో నీతిపద్యాల ప్రతులు లక్షన్నర కాపీలను ముద్రించి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. తెలుగుభాషపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి పెద్దబాలశిక్ష పుస్తకాలను, బాలభారతం, రామాయణ, భాగవతం వంటి గ్రంథాలను పిల్లలకు బహుమతులుగా అందజేశారు. వీరు తెలుగుభాషకు చేస్తున్న కృషికి రాష్ట్రంలోనే కాదు, జాతీయ స్థాయిలోనూ పలు సన్మానాలు, సత్కారాలు బిరుదులు దక్కాయి.

తెలుగుభాష, సంస్కృతిని కాపాడడమే లక్ష్యం...



తెలుగుభాషను కాపాడుకోవాలనే ఆలోచనతోనే కృషిచేస్తున్నాం. ముఖ్యంగా తెలుగు సంస్కృతి, ఆచార వ్యవహారాలను భవిష్యత్తు తరాలకు అందివ్వాలన్నదే మా సంకల్పం. సెలవు దినాలు, రోజువారి ఖాళీ సమయాల్లో కార్యక్రమాలను చేస్తున్నాం. ఇందుకు సహకరించి చేదోడుగా నిలుస్తున్న తెలుగుభాషాభిమానులకు రుణపడి ఉంటాం.

–తులసీనాథం నాయుడు, తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పలమనేరు

భర్తకు తోడుగా నిలిచా..



మాతృభాష అయిన తెలుగును మరువరాదు. తెలుగుభాషపై పట్టుంటే మిగిలిన భాషల్లోనూ రాణించవచ్చు. నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలపై నిర్లక్ష్యం చూపుతోంది. ప్రపంచ దేశాలు మన సంస్కృతిని పాటిస్తుంటే మనం పట్టించుకోవడం లేదు. భర్తకు అండగా తెలుగుభాషాభివృద్ధికోసం కృషిచేస్తున్నా.

–పుష్ప, సమితి కార్యదర్శి, పలమనేరు

రహదారుల్లో గుంతలు



చిత్తూరు–వేలూరు రహదారిలోని ఫ్లైవర్‌పై గుంత



గుంతలమయంగా మారిన చిత్తూరు–వేలూరు రహదారి

గుడిపాల: మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారిలో, మద్రాస్ క్రాస్ రోడ్డు వద్ద బ్రిడ్జిపైన, పెట్రోల్‌బంక్ సమీపంలో రోడ్డులో పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పాదచారులు, వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. గుంతలు పూడ్చాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. తరచూ రోడ్లలో గుంతల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



మంగళపల్లె పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దాతలు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం దాతలు విద్యాసామగ్రిని అందజేశారు. చిత్తూరు అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాష్ రెడ్డి ప్రముఖ శతావధాని ఆముదాల మురళి సౌజన్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రితో పాటు రామకృష్ణ మిషన్ వారిచే స్వామి వివేకానంద జీవిత చరిత్ర, సందేశం పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.